

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.5	27.6
కావలి	35	27
ఆత్మకూరు	38	27
ఉదయగిరి	38	26
కందుకూరు	36	27




వైసీపీ పాపం పట్టణ వాసులకు శాపం

తడిసి మోపెడు అవుతున్న ఆస్తి పన్ను

- నాటి పాలనలో ఏటేటా పన్ను పెంపు ప్రారంభం
- ఐదేళ్లలో రూ. 60 కోట్లకుపైగా భారం
- పేద, మధ్యతరగతి వర్గాలపై ఇంటి అద్దె భారం
- చెత్త పన్నులా ఈ విధానాన్ని ఎత్తేయాలి

నెల్లూరు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానా నింపడం కోసం గత వైసీపీ ప్రభుత్వం పెంచిన పన్నుల భారం నేటికీ పట్టణవాసులను వేధిస్తోంది. ప్రతి ఏటా పన్ను పెంపు విధానం పట్టణాల్లో ఇంటి అద్దెలను అమాంతం పెంచేస్తోంది. పరోక్షంగా ఈ ప్రభావం సొంతిల్లు లేని పేద, మధ్య తరగతి ప్రజలపై పడుతోంది. గతంలో నాలుగైదు ఏళ్లకు ఒకసారి పెరిగే అద్దె, వైసీపీ ప్రభుత్వం పుణ్యమా.. అని 2020-21 నుంచి ప్రతి ఏటా పెరుగుతోంది. జీతాలు, ఆదాయం పెరగక పోగా, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో పేదలకు ఇంటి అద్దె పెంపు అదనపు భారంగా మారింది. గత పాలకులు ప్రభుత్వం విధించిన చెత్త పన్ను లాంటి చెత్త విధానాలకు చెల్లుచీటి పలికిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ఆస్తి పన్ను విషయంలోనూ కాస్త ఆలోచించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



● కొత్త విధానంతో చిక్కులు

అద్దె విలువ ప్రామాణికంగా ఆస్తి పన్ను వసూళ్లు చేసే విధానం అమలులో ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం 2020-21 నుంచి ఆస్తి పన్ను విధింపులో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. ఆయా ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ఆస్తి పన్ను నిర్ణయించి, దానిపై ప్రతి ఏటా రెండుశాతం పన్ను పెంచుతూ వెళ్లే విధానాన్ని అమలుల్లోకి తెచ్చింది. ఈ విధానం కారణంగా 2020-21 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను దాదాపుగా రెట్టింపు అయింది.

- ఉదాహరణకు నెల్లూరు నగరంలోని 41వ డివిజన్ పరిధి మనుమసిద్ధి నగర్‌లో 18 అంకణాల్లో నిర్మించిన బీ +1 భవనానికి 2019-20లో అద్దె ప్రాతిప్రదికన ఉన్న లెక్క ప్రకారం ఇంటి పన్ను రూ. 1,771లు వస్తుండగా, అప్పుడే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2021లో తీసుకువచ్చిన రిజిస్టేషన్ విలువతో ఇంటి పన్ను పెంచే విధానంతో రూ. 2,031లుకు చేరింది. అది కాస్త ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ. 3,499లకు పెరిగింది.
- అలాగే నెల్లూరు రూరల్ పరిధి రెండువ డివిజన్ అల్లీపురం వద్ద 950 చ.అ విస్తీర్ణంలోని అపార్టుమెంట్ ప్లాటుకు 2018-19లో రూ. 479లు మాత్రమే అద్దె ప్రాతిపదిక ఇంటి పన్ను వస్తుండగా, 2021లో రూ. 551లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ. 964లుకు చేరింది. ఇదీ ఆరు మాసాల ఇంటి పన్ను మాత్రమే. పై రెండు ఉదాహరణలను గమనిస్తే.. ఐదేళ్ల లో ఇంటి పన్ను రెట్టింపు అయింది.

భారీగా పెరిగిన డిమాండ్

వైసీపీ పాలనలో తీసుకువచ్చిన కొత్త విధానం కారణంగా దాదాపుగా మున్సిపాలిటీల ఆస్తిపన్ను డిమాండ్ 50 శాతానికి పైగా పెరిగింది. నెల్లూరు కార్పొరేషన్ విషయానికి వస్తే 2019-20 ఆర్థిక సంవత్సరం డిమాండ్ రూ. 82.22 కోట్లు కాగా, కొత్త పన్ను విధానం అమలులోకి వచ్చిన తొలి సంవత్సరం(2020-21) 97.85 కోట్లకు పెరిగింది. ఆ ఒక్క సంవత్సరమే రూ. 15 కోట్లు పెరిగింది. ఇక అప్పటి నుంచి ప్రతి ఏటా డిమాండ్ పెరుగుతూనే వస్తోంది. 21-22 ఆర్థిక సంవత్సరం 98.34 కోట్లు, 22-23వ సంతవ్సరం 116.28 కోట్లు, 2024-2025 ఆర్థిక సంవత్సరం 130.22 కోట్లకు పెరిగింది. అసెస్‌మెంట్లు భారీగా పెరిగాయి కాబట్టి డిమాండ్ పెరిగిందని అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే నెల్లూరు కార్పొరేషన్‌లో ఈ ఐదేళ్లలో పెరిగిన అసెస్‌మెంట్లు 9వేలు మాత్రమే.

- కావలి మున్సిపాలిటీలో 2019-20వ సంవత్సరం డిమాండ్ రూ. 11.81 కోట్లు కాగా, 2024-25వ సంవత్సరం డిమాండ్ రూ.20.62 కోట్లు. అంటే ఇక్కడ ఆస్తి పన్ను దాదాపుగా రెట్టింపు అయింది.
- కందుకూరు మున్సిపాలిటీలో 2019-20వ సంవత్సరం డిమాండ్ రూ. 4.75 కోట్లు కాగా, 2024-2025వ సంవత్సరానికి 9.20 కోట్లుకు పెరిగింది. ఇక్కడ కూడా ఆర్థి పన్ను దాదాపుగా రెట్టింపు అయింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పన్ను భారం మరో రెండు శాతం పెరగనుంది.

ఆస్తి పన్నుల డిమాండ్ ఇలా...

ఆర్థిక సంవత్సరం	అసెస్‌మెంట్లు (రూ.లక్షలో)	డిమాండ్ మొత్తం (రూ. కోట్లలో)
నెల్లూరు కార్పొరేషన్‌లో		
2020-21	1.26	97.95
2021-22	1.27	98.34
2022-23	1..31	116.28
2023-24	1.33	112.52
2024-25	1.37	130.22
కావలి మున్సిపాలిటీలో		
2018-19	13612	12.15
2019-20	23653	11.82
2020-21	24040	13.66
2021-22	24374	14.46
2022-23	25065	18.30
2023-24	25323	19.29
2024-25	25618	20.62
కందుకూరు మున్సిపాలిటీలో		
2020- 21	14930	6.48
2021- 22	15120	6.52
2022- 23	15368	7.001
2023- 24	15428	7.24
2024- 25	15571	9.20
ఆత్మకూరు మున్సిపాలిటీలో		
2020 - 21	7897	2.08
2021 - 22	7897	2.11
2022 - 23	8187	2.30
2023 - 24	8384	2.38
2024 - 25	8582	2.72
2025 - 26	9020	2.97

పెరిగిన అద్దెల భారం

2019-20 నుంచి 2024-25వ ఆర్థిక సంవత్సరం వరకు నెల్లూరు కార్పొరేషన్‌లో డిమాండ్ 50 కోట్ల మేర పెరిగింది. జిల్లా పరిధిలోని కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో మరో రూ.13 కోట్ల మేర పన్ను భారం పెరిగింది. అంటే మొత్తం నెల్లూరు కార్పొరేషన్, మూడు మున్సిపాలి టీలను కలుపుకుంటే రూ. 63 కోట్ల భారం పెరిగింది. పరోక్షంగా ఇంత కు రెట్టింపుభారం అద్దె కుటుంబాలపై పడింది. ఆస్తి పన్ను పెరిగిన క్రమం లో ఇంటి అద్దెలు విపరీతంగా పెంచేశారు. 2019కి పూర్వం రెండు మూడు ఏళ్లకు పదిశాతం అద్దె పెంచడం ఆనవాయితీగా ఉండేది. ఎప్పుడైతే ప్రతి ఏటా ఆస్తిపన్ను పెంచడం ప్రారంభం అయిందో... అప్పటి నుంచి అద్దె కూడా ప్రతి ఏటా పెంచడం మొదలయింది. ప్రతి ఏటా కనిష్ఠంగా రూ. 500 నుంచి రూ.1000 వరకు అద్దె పెంచుతున్నారు. బతుకు తెరువు కోసం, పిల్లల చదువు, ఉద్యోగ రీత్యా పట్టణాల్లో అద్దె ఇళ్లను ఆశ్రయించిన పేద, మధ్య తరగతి ప్రజలపై అద్దె భారం మోయలేనంతగా పెరిగింది. ఇదేమని అడిగితే గృహ యజమానులు పన్నుల లెక్క చెబుతున్నారు.

చెత్త పన్నులా తొలగించాలి

గత వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్త పన్నును కూట మి ప్రభుత్వం తొలగించింది. దీంతో ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీల ఆదాయం ఆయా మున్సిపాలిటీలకే చెందేలా నిర్ణయం తీసుకుంది. దీనివల్ల మున్సిపాలిటీలకు స్వయం ప్రతిపత్తి ఇచ్చినట్లైంది. అలాగే ఆస్తి పన్ను విషయంలోనూ కూటమి ప్రభుత్వం కాస్త ఆలోచించాలని, పాత విధానాన్ని కొనసాగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలా కాని పక్షంలో ప్రతి ఏటా రెండు శాతం పన్ను పెంచే విధానంలోనైనా కాస్త మార్పు తీసుకురావాలని వారు కోరుతున్నారు. పన్ను భారం తగ్గించడం లేదా ప్రతి ఏటా పెరుగుదలను నియంత్రించడం ద్వారా తమను ఆదుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మార్గదర్శి - బంగారు కుటుంబంలో భాగస్వాములు కండి

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజం కోసం ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మార్గదర్శి- బంగారు కుటుంబం పథకంపై ఆసక్తి ఉన్నవారు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఈ పథకం గురించి టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష కుటుంబాలకు పీ4లో సహాయం అవసరం ఉన్న కుటుంబాలుగా గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, ధనికులు, సేవాభావం కలిగినవారు ఈ పథకంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ప్రతిశాఖ కనీసం 10 మందిని ఈ పథకంలో భాగస్వాములయ్యేటట్లు చూడాల న్నారు. ఎవరినీ బలవంతంగా ఈ పథకంలో చేర్చవద్దని చెప్పారు. పేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి, ఆ కుటుంబాలను దత్తత తీసుకోవడం, వారికి మార్గదర్శకులుగా ఆర్థిక సహకారం అందించడం, వ్యాపారాల కోసం రుణాలు ఇప్పించడం, యువతకు కెరీర్ గైడెన్స్ అందించడం, కుటుంబ అవసరాలను గుర్తించి ఆర్థిక సహాయం అందించడం తదితరాలు చేయాలన్నారు. పేదలతో అనుబంధం పెంపొందించుకోవడం ద్వారా సేవలందించవచ్చని వివరించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఈ పథకంలో అవకాశం, ఆసక్తిఉన్న ప్రతిఒక్కరూ భాగస్వాములై పేదరికం నుంచి జిల్లాను విముక్తి చేయాలని కలెక్టర్ కోరారు.


కలెక్టర్ ఆనంద్

స్టార్ హోటళ్లలో బార్లకు ఫీజు తగ్గింపు

- టూరిజం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నిర్ణయం
- త్వరలోనే ఉత్తర్వుల జారీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టూరిజం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం త్రీస్టార్స్ ఆపై స్టార్లున్న హోటళ్లలో బార్ల ఏర్పాటుకు నాన్‌రీఫండబుల్ ఫీజును భారీగా తగ్గించనున్నది. ఇందుకు సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో త్రీస్టార్స్ ఆపై స్టార్స్ ఉన్న హోటళ్లలో బార్లు ఏర్పాటు చేసుకునేందుకు నాన్ రీఫండబుల్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 లక్షలుగా నిర్ణయించింది. ప్రతి ఏటా కొంత శాతం ఫీజు పెంచేలా జీవోను విడుదల చేసింది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన లైసెన్స్ ఫీజు ఈ ఏడాది రూ.70 లక్షలకు చేరింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలోనే మన రాష్ట్రంలో హోటళ్లలోని బార్లకు రిజిస్ట్రేషన్ చార్జీలు ఎక్కువగా ఉన్నాయని, ఇది టూరిజంపై ప్రభావం చూపుతుందని పేర్కొంటూ, చార్జీల సవరణకు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. పక్క రాష్ట్రాల్లో ఉన్న చార్జీలు ప్రకారం తగ్గింపు ఇవ్వాలని కోరింది. పరిశీలించిన ప్రభుత్వం లైసెన్స్ ఫీజు రూ.5 లక్షలు, రిజిస్ట్రేషన్ చార్జీలు సంవత్సరానికి రూ.20 లక్షలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మరో రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ అవుతాయని సమాచారం. కాగా నెల్లూరు నగరంలో డీఆర్ ఉత్తమ్, మినర్వా గ్రాండ్ హోటళ్ల నిర్వాహకులు బార్లకు ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతులు పొంది నిర్వహిస్తున్నారు.

సూక్ష్మపోషకాలు అందేనా ?

- భూమి సారవంతానికి అవి ఎంతో ముఖ్యం
- అధిక దిగుబడుల్లో కీలకపాత్ర
- రాయితీ కోసం ప్రభుత్వంపై అన్నదాత ఆశలు

జిల్లాలో ఎడగారు సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో వారిపై సూక్ష్మపోషక ఎరువుల భారం పడనుంది. భూముల సారవంతానికి, పంట దిగుబడులు పెంచేందుకు జింక్, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలు ఎంతో ముఖ్యం. వీటిని గతంలో టీడీపీ ప్రభుత్వం రాయితీపై రైతులకు అందించేది. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం రాయితీని పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా వీటిని రాయితీపై అందిస్తుందన్న ఆశతో రైతులు ఉన్నారు.

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా సూక్ష్మపోషకాల వినియోగాన్ని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తారు. వాటిఆధారంగా ఏ రైతుకు ఏది అవసరమో గుర్తించి, దాన్ని రాయితీపై అధికారులు అందించేవారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని పూర్తిగా పక్కన పెట్టడంతో రైతులపై అదనపు భారం పడింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో భూసార పరీక్షలకు జీవం వచ్చింది. లక్ష్యాలను నిర్ధేశించడంతోపాటు నిధుల కేటాయింపులు చేసింది. దీంతో సూక్ష్మపోషకాలు కూడా రాయితీపై అందిస్తుందని రైతులు భావిస్తున్నారు.

50 నుంచి 75శాతం రాయితీ

సూక్ష్మపోషకాలలోపం కారణంగా దిగుబడులు తగ్గిపోతున్నాయని భూసార పరీక్షల ద్వారా తెలుసుకున్న టీడీపీ ప్రభుత్వం 2016లో రైతులకు 50 నుంచి 75శాతం రాయితీపై అందించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. అక్కడ పేర్లు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో నగదు చెల్లించిన వారికి కంపెనీల నుంచి తెప్పించి అందిస్తామని ప్రకటించింది. ఆ తరువాత పేర్ల నమోదు కూడా ఆగింది. దీంతో రైతులు, కౌలు రైతులపై సూక్ష్మపోషకాల భారం పడింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ఎడగారులో దాదాపు 3.5లక్షల ఎకరాల్లో వరిసాగవుతుందని అధికారుల అంచనా. జిల్లాలోని భూముల్లో 78శాతం జింకు, 73శాతం బోరాన్, 24శాతం ఇనుము, 13.48శాతం మాంగనీసు, 21శాతం రాగి, 10శాతం సల్ఫర్ తక్కువ మోతాదులో ఉన్నట్లు భూసార పరీక్షా కేంద్రం అధికారులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా జిప్సం, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలని కూడా రైతులకు వారు సూచిస్తున్నారు. ఆయా లోపాలను నివారించేందుకు జింకు, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఏటా వీటిని రైతులు వినియోగిస్తుంటారు. దుక్కిదున్నే సమయంలో భూసార పరీక్ష ఫలితాల ద్వారా ఎంతశాతం జింకు లోపం ఉందో గుర్తించి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తారు. జింకు లోపం కారణంగా ఆకుల మధ్య భాగం పసుపు రంగులోకి మారి మొక్కలు గిడసబారిపోతాయి. దీనివల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. చౌడు భూముల్లో సోడియాన్ని తగ్గించేందుకు జిప్సం ఉపయోగపడుతుంది. ఇందులో కాల్షియం, గంధకం ధాతువులుంటాయి. ఇక బోరాన్ పూత దశలో ఎంతో కీలకం. ఆకుల్లో తయారయ్యే ఆహారాన్ని అన్ని భాగాలకు ఇది అందిస్తుంది. దీన్ని వేయకపోతే ఉద్యాన పంటల్లో కాయలు పగిలిపోతాయి.


జిప్సం


జింకు లోపంతో పసుపు రంగుకు మారిన వరిపైరు (ఫైల్)

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు

రాయితీపై సూక్ష్మపోషకాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతులు కోరితే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం.

\- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సమాచారమిచ్చినా స్పందించని ఇరిగేషన్ అధికారులు

రాజుపాలెం చెరువు నుంచి గ్రావెల్ దోచేస్తున్నారు

ఉలవపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం పెద్ద చెరువు నుంచి రాత్రిళ్లు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాజుపాలెంకు చెందిన అధికార పార్టీ నాయకుడొకరు, ఉలవపాడుకు చెందిన కొందరితో ఒప్పందం కుదుర్చుకుని సుమారు 300 ట్రాక్టర్ల గ్రావెల్ తోలకానికి సిద్ధపడ్డారని వారు పేర్కొన్నారు. ఉలవపాడులోని వరిగచేను ఎస్టీ కాలనీ వెనుక బైపాస్‌కు ఆనుకొని ఖాళీ స్థలంలో ప్లాట్లు వేసేందుకు గ్రావెల్‌తో చదును చేస్తున్నారు. సుమారు 4 అడుగుల మేర తోలేందుకు ట్రాక్టర్ గ్రావెల్ రూ.1000 లెక్కన రాజుపాలెం పెద్ద చెరువులో నుంచి తోలేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో మాట్లాడుకున్నట్లు సమాచారం. ఆదివారం కావడంతో అధికారులు కూడా స్పందించరనే కారణంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి గ్రావెల్ తోలుతున్నారు. ఈ విషయమై కందుకూరు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని స్థానికులు పేర్కొన్నారు. ఇదే విషయమై ఇరిగేషన్ డీఈ హజరత్తయ్యకు ఫోన్ చేయగా స్పందించలేదు. ఏఈ సీతారామయ్య స్పందిస్తూ.. 'అవునా... ఇంకా తోలుతున్నారా... కనుక్కుంటాను'.. అంటూ దాటవేసే ధోరణిలో మాట్లాడటం అనుమానాలకు తావిస్తోంది.



హెచ్ఎం రామలక్ష్మమ్మకు సేవా పురస్కారం

కందుకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దన కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న గుంటక రామలక్ష్మమ్మను ఆదివారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సేవా పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, చక్కా వెంకటేశ్వరావు, గుర్రం అల్లూరయ్య, కోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాబ్‌మేళా

● సద్వినియోగం చేసుకోండి : ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని టీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సోమవారం ఉదయం నిర్వహించే మెగా జాబ్ మేళాను కందుకూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులంతా ఈ జాబ్‌మేళాకు హాజరయ్యేందుకు అర్హులేనని, అనేక ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని ఉద్యోగులను ఎంపిక చేసుకోనున్నందున నిరుద్యోగులంతా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ఉలవపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి పాఠశాల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్, క్రాఫ్ట్స్ తదితర అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు.

నేడు విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రాక

ఉలవపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మన్నేటికోట, బద్దిపూడి గ్రామాల్లో పర్యటించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు మన్నేటికోట గ్రామంలో ఉదయం 10గంటలకు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమి పూజ, అనంతరం బద్దిపూడిలో ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంక్, సీసీ రోడ్లు ప్రారంభిస్తారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రానికి చంద్రబాబు.. బ్రాండ్

● అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి : వీపీఆర్ ● టీడీపీ, జనసేన, బీజేపీల ఆత్మీయ సమావేశం

కావలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అని ఆయన ఆధ్వర్యంలో మనమంతా అభివృద్ధికి పాటుపడాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఆత్మీయసమావేశంలో ఆయన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. కూటమి ఎదుగుదలను చూసి బేదాభిప్రాయాలు తేవటానికి కొందరు ప్రయత్నిస్తున్నారని అందరూ కలిసి ఉంటే ఎవరూ మనల్ని ఏమీ చేయలేరన్నారు. ఏమైనా సమస్యలుంటే మా దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. కావలి అభివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. అలాగే ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో కూల్చివేతలు, కేసులతో కొనసాగించిందని వాపోయారు. గత వైసీపీ కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఆరాచకాలను తట్టుకోలేక కావలిలో అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై ఎన్నికల్లో పనిచేశారని తెలిపారు. సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, కావలి బీజేపీ నేతలు కందుకూరి సత్యనారాయణ, సీవీసీ సత్యం, జనసేన కావలి ఇన్‌చార్జి ఆళహరి సుధాకర్, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, పమిడి రవికుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నుడా చైర్మన్‌ను సత్కరిస్తున్న అభిమానులు

'ఇండియాలో ఇప్పుడేం చేయాలి' పుస్తకావిష్కరణ

కందుకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఐడెంటిటీ, అలయెన్స్ దిశగా దళిత బహుజనులు ముందుకు సాగాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యస్‌జే విద్యాసాగర్ కోరారు. సాధు మాల్యాద్రి రచించిన ఇండియాలో ఇప్పుడేం చేయాలి పుస్తకావిష్కరణ కార్యక్రమం పట్టణంలోని స్వర్ణప్యాలెస్ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం సాయంత్రం జరిగింది. బీఎస్పీ నాయకుడు కె మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అబ్బుల్ నూర్‌బాషా, బీ లక్ష్మీనరసయ్య, వీసీకే పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడారు. వివిధ దళిత సంఘాల నాయకులు బద్దిపూడి జయరావు, ఎం బుద్ధకోటి, చార్వాక, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో దళితసంఘాల ప్రతినిధులు

యూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

● అధికారులకు తల్లిదండ్రుల మొర

లింగసముద్రం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ స్థులు ఆదివారం అధికారులను ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పులలో భాగంగా తమ యూపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయాలని అధికారులు నిర్ణయించారని, ఈ నిర్ణయం వలన పాఠశాలలో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులు 4 కి.మీ దూరంలో ఉన్న లింగసముద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. అయితే తమ యూపీ పాఠశాలనే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తే, తమ పాఠశాలకు రెండు మూడు కి.మీ దూరంలోని బీమాలపాడు, రళ్లపాడు, జంపాలవారిపాలెం, వాకమళ్లవారిపాలెం, గొల్లపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు తమ పాఠశాలలో చేరే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని మండల విద్యా శాఖ అధికారులకు వివరించినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 77 మంది 6 నుంచి 8 తరగతుల వరకు 61 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఐటీఐల ప్రభుత్వ 51, 52, 53 మంది విద్యా ర్థులున్న యూపీ పాఠశాలలను సైతం హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి తమ యూపీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ పాఠశాలను కూడా హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం

కొండాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కూలీలకు ప్రభుత్వం రెండు రకాల బీమా సౌకర్యం కల్పించనుందని ఎంపీడీవో ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి పథకం కింద పోస్టల్ ఖాతా ఉన్న 18- 70ఏళ్ల నిండిన వారు అర్హులన్నారు. వివరాలకు గ్రామ క్షేత్ర సహాయకులను సంప్రదించాలన్నారు.

వంతెన గోడలోని చెట్ల తొలగింపు

కావలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెన గోడలో ఉన్న వృక్షాలను అధికారులు తొలగించారు. వంతెన గోడల్లో వృక్షాలు.. పగుళ్లిస్తున్న నిర్మాణాలు, పట్టించుకోని అధికారులు అనే శీర్షికతో ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే వంతెన గోడలో ఉన్న వృక్షాలను తొలగించారు. అంత వరకు బాగానే ఉన్నా వృక్షాలను మొదళ్ల వరకు మాత్రమే తొలగించారు. వాస్తవంగా వాటి వేర్లను సైతం తొలగించి అక్కడ యాసిడ్ వేస్తే భవిష్యత్తులో మళ్లీ అక్కడ వృక్షం పెరగకుండా ఉండేందుకు అవకాశం ఉంది. కానీ అధికారులు ఆ పని చేయలేదు. దీంతో ఆ వృక్షాలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ

కావలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అధ్వర్యంలో ఉచితంగా ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక మినీస్టేడియంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 155మంది దివ్యాంగులకు ఉచితంగా ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నేత ఆళహరి సుధాకర్, బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులు.. ప్రభుత్వ భద్రతా వైఫల్యమే !

బిట్రగుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడులు ప్రభుత్వ భద్రతా వైఫల్యం కారణం అని సీపీఎం సీనియర్ నేత తుమ్మలవెంకయ్య ఆరోపించారు. ఈ విషయంపై ఆదివారం ఆయన బోగోలు మండల సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా పెహల్గాంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పర్యాటకుల కేంద్రంలో ప్రభుత్వం భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గడ్డం మాల్యాద్రి, ఎస్ రామయ్య, సీఐటీయు మండల కార్యదర్శి చల్లా నరహరి, షేక్‌బాదుల్లా, షేక్అన్వర్ బాషా, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు తుమ్మల వెంకయ్య

నేడు ముస్లింల ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ సోమవారం సాయంత్రం కందుకూరులో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మర్చంట్స్ మసీదు నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిర్వహించే ర్యాలీలో ప్రజాస్వామ్య వాదులు, లౌకికవాదులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఈతకు వెళ్లే పిల్లలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

జలదంకి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవిసెలవుల నేపథ్యంలో పిల్లలు ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువలు, బావులు, వాగులు, గుంటల్లోకి వెళుతుంటారని వారి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మండల ఎస్ఐ నయ్యద్ లతీఫున్నీసా సూచించారు. విద్యార్థులకు వేసవిసెలవుల నేపథ్యంలో ఆదివారం మండలంలోని పలు చెరువులు, నీటివనరులను పరిశీలించి ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లలకు ఈత నేర్పించాలనుకుంటే తల్లిదండ్రులు దగ్గరుండి నేర్పించాలన్నారు. నీటివనరుల పరిశీలనలో ఎస్ఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

జనసేన కలిగిరి మండల అధ్యక్షుడి అరెస్టు

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): తల్లిపై దాడి, హత్యాయత్నం కేసులో జనసేన మండలాధ్యక్షుడు బందారు లక్ష్మీ నారాయణను ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి తండ్రీకొడుకులపై ఆకారంగా కర్రతో దాడి చేసిన ఘటనలో జిర్రావారిపాలెం గ్రామానికి అర్ధరాత్రి వారు ప్రధాన రహదారిపై బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు నిందితుడి తల్లి వనమ్మపై కూడా దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది. ప్రస్తుతం నిందితుడిని తల్లిపై దాడి కేసులో అరెస్టు చేశామని, గ్రామంలోని తండ్రీ కొడుకులపై దాడి కేసులో మరోసారి అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఉచిత ఖత్నా శిబిరం

కావలిటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సలఫీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాది మంజిల్‌లో ఉచిత ఒడుగుల (ఖత్నా) శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ బాధ్యులు పఠాన్ ఇర్ఫాన్, షేక్ ఇర్ఫాన్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో 40మంది చిన్నారులకు ఖత్నా చేశారు. కార్యక్రమంలో ఆలీ హదీస్ పట్టణ కార్యదర్శి షేక్ జమీర్, ఉపాధ్యక్షులు అబుసులేమాన్, ఎస్‌కె బాబు, మస్తాన్‌వలి, ఎస్‌కె రిజ్వాన్, అమ్జద్‌ఖాన్ పాల్గొన్నారు.

వినియోగదారుల విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ

● ట్రాన్స్‌కో ఏఈ మన్మధరావు



సంగం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందని, దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ మన్మధరావు తెలిపారు.

? అదనపు లోడు అంటే ఏమిటి, డెవలప్‌మెంట్ చార్జీలు ఎంత, ఇప్పుడు ఎంత రాయితీ ఇస్తున్నారు.

! వినియోగదారులు గతంలో అవసరాల మేరకు సర్వీస్ తీసుకునే సమయంలో ఒక కిలోవాట్‌కు తీసుకుని ఉండవచ్చు. కిలోవాట్ కంటే ఎక్కువ వినియోగిస్తుంటే అదనపు లోడు అంటారు.

? 50 శాతం రాయితీ అంటే ఎంత మొత్తం.

! గతంలో ఒక కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ. 2వేలు. ప్రస్తుతం వినియోగదారుడు స్వయంగా క్రమబద్ధీకరించుకుంటే కిలోవాట్‌కు రూ. 1000 చెల్లిస్తే సరిపోతుంది. లేకపోతే విద్యుత్ అధికారులు తనిఖీ సమయంలో అదనపు లోడు వినియోగిస్తున్నట్లు తెలిస్తే పూర్తి మొత్తంతో పాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

? క్రమబద్ధీకరణ ఎలా చేసుకోవాలి.

! వినియోగదారుడు గూగుల్‌లో ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే వాలంటరీ ఆడిషనల్ లోడ్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి అదనపు లోడ్‌కు కిలో వాట్‌కు రూ. 1000 చొప్పున ఎన్ని కిలోవాట్‌లు కావాలంటే అన్నింటికి చెల్లించవచ్చు.

? క్రమబద్ధీకరణకు ఎప్పటి వరకు అవకాశం ఉంది.

! క్రమబద్ధీకరణకు జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

అనంతసాగరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు డి నారాయణ తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటలకు వరకు తరగతులు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

● మొక్కుబడిగా స్వచ్ఛ కార్యక్రమాలు

● పట్టించుకోని అధికారులు



గండిపాళెం పంట కాలువలో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల నిషేధం అమల్లో ఉన్నా అధికారుల ఉదాసీనత వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పట్టణాలతో సహా పల్లెల్లోను పాలిథిన్ వస్తువుల వినియోగం రోజు రోజుకు పెరుగుతోంది. ఇవి భూమిలో కరగకపోవడంతో భూసారం దెబ్బ తినడం, భూగర్భ జలమట్టం అడుగంటడం జరుగుతోంది. మరుగు కాలువల్లో పాలిథిన్ సంచులు, గ్లాసులు చేరడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా పాలిథిన్ సంచుల్లో తీసుకెళ్లే ఆహార పదార్థాలు ఆనారోగ్యానికి కారణమవుతున్నాయి. పాలిథిన్ సంచులు చెత్తలో వేయడం వల్ల వాటిని తినే ఆవులు, గేదెలు, మూగజీవాలు ఎలా చనిపోతున్నాయి. ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ఎన్ని చట్టాలు చేసినా సంబంధిత శాఖలు చోద్యం చూస్తున్నాయే తప్ప వాటిని అమలు పర్చడంలో వెనకడుగు వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నీరుగారుతున్న లక్ష్యం

ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా అనేక స్వచ్ఛ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుంటేనే ప్రత్యేక కార్యక్రమాలు రోజుల్లో హడావిడి చేసే అధికారులు మొక్కుబడి కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతుంది. ప్రధాన కూడళ్లు, దుకాణాల సముదాయాలు, నివాసాల నుంచి సేకరించే చెత్తలోను ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా కన్పిస్తుండడం దారుణం. అంతేగాక హోటళ్లు, దాబాలు, కూరగాయలు, పండ్లు, జ్యూస్, కిరాణా, చికెన్ తదితర దుకాణాల్లో వినియోగిస్తున్నప్పటికీ అడుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గంగమ్మకు పూజలు

ఉదయగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా భక్తులు బుట్టల్లో పొంగలి సామగ్రితో బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆల యానికి చేరుకున్నారు. అనంతరం ఆల య ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, ఆలయ చైర్మన్ పాముల రమణయ్య అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రతిఒక్కరూ సజ్జన సాంగత్యం అలవర్చుకోవాలి

వింజమూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సజ్జన సాంగత్యం అలవర్చుకోవాలని గూడూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ లావణ్యలత సూచించారు. స్థానిక శ్రీవేద వ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హేమలత, రాజేశ్వరి, స్వరాజ్యం, ఉమ, సీత, లక్ష్మి, నాగరత్నమ్మ, తదితర ధ్యానులు పాల్గొన్నారు.

వేరుశనగ కట్టెకు డిమాండ్

● రైతుల్లో ఆనందం

సంగం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ కట్టెకు డిమాండ్ పెరిగింది. ఎకరా పొలంలో కట్టె సుమారు రూ. 5వేలు పలుకుతోంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని పడమటిపాలెం, పల్లిపాళెం అనసూయనగర్ తదితర ప్రాంతాల్లో పెన్నానది ఒడ్డున ఇసుక నేలల్లో విరివిగా వేరుశనగ సాగుచేస్తారు. ఇసుక నేలల్లో వేసే పంట వంద శాతం. దీంతో ఏడాదికి రెండు సార్లు పంట సాగు చేస్తారు. పంట కోసిన తరువాత ఈ కట్టెను పశువులకు మేతగా వినియోగిస్తారు. ఈ కట్టె తిన్న పాడి పశువులు పాలు బాగా ఇస్తాయి. దీంతో కలిగిరి వింజమూరు తదితర ప్రాంతాల పాడి రైతులు వస్తుండడంతో మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో వంద సాగు చేసే రైతులకు ఎకరాకు ఐదు వేల చొప్పున అదనపు ఆదాయం పెరిగినట్టయింది. ఈ ఆదాయం పొలం దుక్కులకు సరిపోతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న వేరుశనగ కట్టె

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ

సీతారామపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన భరతమాత బిడ్డలకు మన నివాళులర్పిస్తూ ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మండల టీడీపీ ఇన్‌చార్జ్ చింతల శ్రీనివాసులు, చింతల కాశావలి ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు కొవ్వొత్తులు వెలిగించి మౌనంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల నాయకుడు చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ ఉగ్రవాదులను తుదముట్టించాలని, ఇంకోసారి ఇలాంటి ఘటనలు పొటుచేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ వెన్నకేశవులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళరెడ్డి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎలిషా కుమార్, జాబువా, జనసేన నాయకులు బోగినేని కోటేశ్వర్లు, మండల మైనార్టీ నాయకులు షేక్ బాబు, మండల ప్రధాన కార్య దర్శి పిడుగు రమేష్, వార్డుమెంబర్ తోట మస్తాన్ జుబిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బస్టాండ్ సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత చిత్రకళా శిక్షణ

ఉదయగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్, చిత్ర కళాకారుడు సుదర్శన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి ఉచిత చిత్రకళ శిక్షణ తరగతులు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తరగతుల నిర్వహణపై ఈనెల 30న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి వచ్చిన విద్యార్థులను కేటగిరీలుగా విభజించి వారికి అనుకూలంగా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శివారు ప్రాంతాల్లో జోరుగా గంజాయి విక్రయాలు

● పెడదారి పడుతున్న యువత

వింజమూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు విమర్శిస్తున్నారు. వింజమూరు పట్టణం విద్యారంగంలో అభివృద్ధి చెందుతున్నా తరుణంలో గంజాయి విక్రయాలు వలన యువత పెడదారి పడుతోందని, పట్టణ శివారు ప్రాంతాల్లో ఈ గంజాయి దందా జరుగుతోందని ఆటు వెళ్లిన్న బాటసారులు తెలిపారు. నిత్యం జగనన్న లేఅవుట్లలోని కాలనీలో గంజాయి సేవిస్తూ గొడవలు పడుతున్నారని తెలిపారు. అలాగే పట్టణంలో క్రికెట్ బెట్టింగులు కూడా సాగుతున్నాయని, టీడీఐ కొన్ని కుటుంబాలు నాశనం అయ్యాయని, కానీ ఎవరూ పట్టించుకోకపోవడం వలన ఈ దందాలు కొనసాగిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంజాయి విక్రయాలు, క్రికెట్ బెట్టింగులు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై దెబ్బతిన్న బారికేడ్లు

● ప్రమాదాల బారిన వాహనదారులు

మర్రిపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై బారికేడ్లు దెబ్బతినడంతో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గతంలో డివైడర్‌పై ఇనుప బారికేడ్లు ఉండేవి. ప్రాంతంలో ముందువైపు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయనందున డివైడర్‌పై వాహనాలు దూసుకెళ్లడంతో బారికేడ్లు ఒక్కొక్కటిగా విరిగిపోయాయి. తిరిగి వాటిని ఏర్పాటుచేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం డివైడర్ పైకి లారీలు, కార్లు దూసుకెళ్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



బారికేడ్లు లేక ప్రమాదకరంగా ఉన్న డివైడర్

ఎక్కడపడితే అక్కడే కిక్కు!



ఫుల్లుగా తాగేశా! ఇంకిక్కడే పడక..

ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డుపై మందుబాబు



రోడ్డయితే మనకేంది! మందెయ్‌మావా..

ఏసీ సెంటర్‌లో డివైడర్‌పై మద్యం సేవిస్తూ..

నెల్లూరు నగరంలో ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తున్నారు. బహిరంగ మద్యపానం నిషిద్ధమైనప్పటికీ మందుబాబులు లెక్క చేయడం లేదు. జనరద్దీ ఉండే రహదారులు, డివైడర్లను కూడా బార్లుగా మార్చేస్తున్నారు. వైన్ షాపుల దగ్గర మద్యం సేవించడానికి అనుమతి లేకపోయినా చాలామంది అక్కడే బుడ్డీ తెరిచేస్తున్నారు. ఇటీవల నగరంలో నేరాలు బాగా పెరిగాయి. వాటిలో ఎక్కువగా మద్యం మత్తులోనే జరుగుతున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బహిరంగ మద్యపానాన్ని అరికట్టాల్సిన అవసరం ఉంది.

- ఫొటోలు : స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నెల్లూరు





పక్కనే అరుగుంటే బారెందుకు!

వాకర్స్ రోడ్డు వెంబడి ఉన్న మద్యం షాపు బయట బహిరంగంగా మద్యం సేవిస్తున్న లిక్కర్ ప్రియులు



గబగబా...!

ఆత్మకూరు బస్టాండు వద్ద కాలువ మీదున్న వంతెనపై మద్యం సేవిస్తున్న వ్యక్తి



ప్రారంభానికి సిద్ధంగా జాతీయ రహదారి

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..!

- పూర్తయిన 167-బీజీ జాతీయ రహదారి
- ప్రమాదరహిత ప్రయాణానికి వీలు
- త్వరలోనే ప్రారంభం

ఉదయగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గతంలో దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు రహదారి ఎంతో అధ్వానంగా ఉండేది. మోకాటిలోతు మార్జిన్లు, సింగిల్‌రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దారుణంగా ఉన్న ఆ రహదారిపై ఎన్నో ప్రమాదాలు సంభవించి, కొంతమంది మృత్యువాతపడగా, మరికొందరు క్షతగాత్రులయిన సంఘటనలూ ఉన్నాయి. అదే రహదారి జాతీయ రహదారి(167-బీజీ)గా రూపుదిద్దుకుని, పనులు చివరిదశకు చేరడంతో ఇప్పుడు అద్దంగా మారింది. దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు 36.4 కిలోమీటర్ల మేర మూడు లైన్ల రహదారి(పది మీటర్లు) పనులను సుమారు రూ.210 కోట్లతో చేపట్టారు. సీతారామపురం మండలం బసినేనిపల్లి వద్ద టోల్‌ప్లాజా, రహదారి మార్గంలో పలుచోట్ల వాగులపై వంతెనలను నిర్మించారు. అలాగే దుత్తలూరు సెంటర్‌లో 565 జాతీయ రహదారి మీదుగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. జంక్షన్‌ల వద్ద విద్యుత్ దీపాలు, సర్వీసు రోడ్లను ఏర్పాటు చేశారు. పనులు దక్కించుకున్న ఆర్‌కే-ఎంఆర్‌జీఆర్ సంస్థ 18 నెలల్లో రహదారి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా, 14 నెలల్లోనే పూర్తి చేసింది. దీంతో ఈ రహదారి నూతన శోభ సంతరించుకుంది. త్వరలో ఈ జాతీయ రహదారి ప్రారంభంకానున్నది.



దుత్తలూరులో పూర్తయిన ఫ్లైఓవర్ నిర్మాణం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేశ్వరి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఏసీ సుబ్బారెడ్డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేశ్వరిని ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ రాజమన్నార్ ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనుండటంతో ఆ స్థానంలో రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ రాజేశ్వరిని ప్రభుత్వం నియమించింది.

సోమశిలలో 51.301 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 51.301 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆలయాల భూముల వేలంలో రెట్టింపు ఆదాయం

- ఓర్వలేక వైసీపీ నేతల అసత్య ఆరోపణలు
- విలేకరులతో టీడీపీ నాయకుడు

చేజర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తలూరుకి చెందిన వీరభద్రస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల భూములకు గత గురువారం గ్రామంలో వేలం నిర్వహించగా, రెట్టింపు ఆదాయం వచ్చిందని టీడీపీ నాయకుడు మోదేపల్లి పెంచలనాయుడు తెలిపారు. ఇది ఓర్వలేకనే వైసీపీ నాయకులు వేలంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 8 బిట్లకు వేలం నిర్వహించగా, గతంలో రూ.1,41,500 ఆదాయం రాగా, తాజాగా నిర్వహించిన వేలంలో రూ. 2,32,500 వచ్చిందన్నారు. ఎలాగైనా వేలంను రద్దు చేయాలన్న దురుద్దేశంతో వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేశారని ఆయన దుయ్యబట్టారు. గ్రామంలో అధికారులు దండోరా వేయించారని, కావాలంటే,సీసీ కెమెరాలు పరిశీలించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఇకపోతే ఆలయ పూజారికి కూడా నెలనెల జీతాలు అందుతున్నాయని చెప్పారు. ఇకనైనా స్థానిక వైసీపీ నాయకులు అసత్యాలు మానుకుని, గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఆయన హితవు పలికారు.

నెలనెలా జీతం బ్యాంకులో జమవుతుంది

దేవదాయశాఖ నుంచి నెలనెలా జీతం నా ఖాతాలో జమవుతోంది. 2020కి ముందు నెల జీతం ఏర్పాటు చేయలేదు. గతంలో ఉన్న అధికారులు కొంత నగదును నాకు జమ చేయలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విడతల వారీగా నగదు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తాజాగా వేలం నిర్వహించగా, అధికారులు నగదును అందజేశారు. పూజారికి జీతం అందడంలేదనేది అవాస్తవం.

- శివయ్య స్వామి, ఆలయాల పూజారి

మధుసూదనరావు కుటుంబానికి అండగా ఉంటాం

ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్సీ బీద, ఎమ్మెల్యే కావ్య వెల్లడి ● రూ.10లక్షల చెక్కు అందచేత

కావలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో మృతి చెందిన పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రాష్ట్ర ప్రభుత్వం తరుపున కావలి ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణతో కలిసి రూ.10లక్షల చెక్కును ఆయన భార్య కామాక్షి ప్రసన్నకు అందజేశారు. ఈ సంద ర్భంగా ఎంపీ మాట్లాడారు. ఉగ్రవాద చర్య జరగటం చాలా దురదృష్టకరమని దీనిపై కేంద్రం సీరి యస్‌గా ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకునే నిర్ణయాలకు తామంతా కట్టుబడి ఉన్నామని చెప్పారు. కేంద్రం తరుపున మధుసూదనరావు కుటుంబానికి అందాల్సిన సదుపాయాలను అందచేసే ప్రయత్నం చేస్తామన్నారు. అవసరమైతే కుటుంబంలో ఒక్కరికి కేంద్ర ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తా మన్నారు. అనంతరం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడారు. తల్లిదండ్రులకు తోడుగా ఉండాలని మధుసూదనరావు అమెరికా నుంచి వచ్చారని ఆయన మృతి దురదృష్టకరం అని, ఆయన లేని లోటును ఎవరూ తీర్చలేమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నేతలు పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, సన్నిబోయిన నారాయణ, సమ్మన వెంకటసుబ్బయ్య, అమరా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రూ.10లక్షల చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నిలకడగా నిమ్మ ధరలు

- గతంలో కంటే తక్కువయినా రైతుల సంతృప్తి

పొదలకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గతేడాదితో పోలిస్తే నిమ్మ ధరలు తక్కువగా ఉన్నా, ప్రస్తుతం నిలకడగా ఉన్నాయి. దీంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాడు ఇదే నెలలో బస్తా కాయలు రూ.9వేలు వరకు ధర పలికాయి. అయితే ఈ ఏడాది రూ.7వేల వద్దే ఆగినా కొద్దిగా రోజులకు నిలకడగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తడంలేదు. ప్రస్తుతం లూజు (బస్తా) ధర ఒక్కింటికి రూ.5400 నుంచి రూ.7వేల వరకు ఉంది. కాయలు బాగా తగ్గిపోవడం వేసవి తాపం పెరగడంతో ఢిల్లీ మార్కెట్లో డిమాం డ్ పెరిగింది. ఏపీ, తెలంగాణా నుంచే కాక బయటి రాష్ట్రాల నుంచి కూడా ఎగుమతులు తగ్గినట్లుగా మార్కె ట్‌కు వచ్చిన కాయలను బట్టి తెలుస్తోంది. నిత్యం అన్నీ ప్రాంతాల నుంచి సుమారు 100 లారీల్లో కాయలు ఎగుమతి అవుతుండగా ప్రస్తుతం 50 లారీ ల్లోనే పంపుతున్నారు. కాయలు తోటల్లో పెరిగేంత వరకు ధరలు తగ్గకున్నా స్థిరంగా తెలుస్తోంది. ఉత్తర భారతం లోని ఢిల్లీతోపాటు లక్నో, వారణాసి, మధుర, గోరఖ్ పూర్, ప్రయాగ్‌రాజ్ తదితర ప్రాంతాలకు తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి నిమ్మకాయలను ఎగుమతి చేస్తుంటారు. అయితే ఈ వేసవిలో ఫ్యాక్టరీలకు కాయలు వెళ్లవు. కేవలం ఇళ్లలో వాడుకకు, శీతల పానీయాల్లో వినియోగానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు. కిలోల లెక్కన చూస్తే రూ.65 నుంచి రూ.85 అమ్ముడుపోతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో అత్యధి కంగా రూ.6వేలు మాత్రమే పలికింది. పొదలకూరు, గూడూరు నిమ్మ మార్కెట్ల నుంచే నిత్యం 25 లారీల కాయలు ఎగుమతి అవుతుంటాయి. అలాగే తెనాలి, ఏలూరు, రాజమండ్రి మార్కెట్ల నుంచే కాగా రాయలసీమ జిల్లాలోని చిన్న చిన్న మార్కెట్ల నుంచి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి. నిమ్మ ఎగుమతులు వారం రోజులుగా తగ్గాయి. తోటల్లో



ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మనుబోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైదాపురం మండలం తూర్పుపూండ్లకు చెందిన అచ్చి వెంకటరాజ (27) మృతి చెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు.. వెంకటరాజ సైదాపురంలోని ఓ మైనింగ్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడు కమ్మవారిపల్లికి చెందిన చల్లా మన్వేష్ మైకాలో పనిచేస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో మరో స్నేహితుడి కారు తీసుకుని నెల్లూరులోని గుడికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కాగితాలపూరు రోడ్డు దాటగానే ఎండకు రోడ్డు పక్కగా ఆగిఉన్న లారీని కారు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు నడుపుతున్న రాజ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోవడంతో పోలీసులు, ప్రయాణికులు అతి కష్టం మీద బయటకు తీశారు. ఈ ప్రమాదంలో రాజకు, మన్వేష్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో గూడూరుకు మన్వేష్‌ను, రాజను నెల్లూరుకు తరలించారు. చికిత్స పొందుతూ రాజా మరణించాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. మన్వేష్ పరిస్థితి విషమం కావడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ రాకేష్ తెలిపారు.





నుజ్జునుజ్జు అయిన కారు, వెంకటరాజా (ఫైల్)

వాహనాల తనిఖీల్లో రూ.34లక్షల పట్టివేత

- సీజ్ చేసి, ఆదాయపన్ను అధికారులకు అప్పగింత

మనుబోలు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న మహిళ రూ.34లక్షలను తీసుకెళుతుండగా గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా నేపథ్యంలో భాగంగా ఎస్‌ఐ శివ రాకేష్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని మిర్యాలగూడకు చెందిన షేక్ పర్వీన్ అనే మహిళ హైద్రాబాద్ నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో చెన్నై వెళుతోంది. పోలీసులు తనిఖీల సందర్భంగా నగదు ఉన్న బ్యాగును గుర్తించి మహిళను అదుపులోకి తీసుకున్నారు. నగదు తరలింపుపై ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం అందించి, నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సదరు మహిళ మిర్యాలగూడలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నట్లు, రూ.34లక్షల నగదును చెన్నైలో బంగారు ఆభరణాల తయారీకి తీసుకెళుతున్నట్లు సమాచారం.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాగుంట కోటారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1992 -93 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పముజుల రవి, అమర్‌నాద్, రఫీ, ముంగర గోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకుని అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వాచ్‌మన్, పూర్వ విద్యార్థులు ఇద్దరికీ ఆర్థిక సహాయం అందజేశారు.



ఉగ్ర దాడిని ఖండిస్తూ ముస్లింల నిరసన ర్యాలీ

రాపూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఆదివారం రాపూరు పట్టణంలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఉగ్రవాదం, మతోన్మాదం నశించి ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, కశ్మీర్‌లో పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు, ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



C.R.I.M.E N.E.W.S

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని(45) వ్యక్తి మృతి చెందిన ఘటన నెల్లూరు నగరంలోని జడ్పీ కాలనీ మూడవ వీధిలో డ్రైనేజీ కాలువ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి తలకు బలమైనగాయం కావడంతో తల, నోరు, చెవుల్లో నుంచి రక్తస్రావమై ఉంది. స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వివరాల కోసం విచారించినా ప్రయోజనం లేకపోయింది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్‌ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతుడు ప్రమాదవశాత్తు కాలువపై పడి గాయాలై మృతి చెందాడా, మరే ఇతర కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఆడిటర్ మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆడిటర్ మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని వనంతోపు మూడో వీధిలో ఆడిటర్ గిరిబాబు(40), భవాని దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. గిరిబాబు శనివారం రాత్రి కుటుంబంతో కలిసి కొద్దిసేపు గడిపారు. అనంతరం పడక గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నారు. గమనించిన భార్య అయనను చికిత్స నిమిత్తం హుటాహుటిన మాగుంట లేవుట్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న వేదాయపాలెం ఎస్‌ఐ విజయకుమార్ వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు సోదరుడు సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు ఆదివారం ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. అనారోగ్య కారణాల నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడు సూసైడ్ లేఖ రాసినట్లు తెలిసింది. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవి పందిని చంపిన వ్యక్తుల అరెస్ట్



అటవీ అధికారుల అదుపులో వేటగాళ్లు

ఉదయగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి రేంజ్ పరిధిలోని నందిపాడు గ్రామ సమీపంలో అడవి పందిని చంపి ముగ్గురు వ్యక్తులు ఆటోలో తరలిస్తుండగా అటవీ అధికారులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నందిపాడు గ్రామ సమీపంలో పొలాల వద్ద కాప లా ఉంటున్న యాకోన్, దేవదాసు, వెంకటేష్‌లు ఉదయగిరి మండలం వడ్లమూడిపల్లి గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లో విద్యుత్ కంచె ఏర్పాటుచేసి అడవి పందిని చంపారు. అనంతరం దానిని ఆటో లో వేసుకుని నందిపాడుకు తీసు కొస్తుండగా 565 జాతీయ రహ దారిపై అటవీ అధికారులు డీఆర్వో మురళి, ఎఫ్‌బీవోలు ప్రసా ద్, ఓంప్రకాష్, భానుతేజలు వాహనాల తనిఖీల్లో భాగంగా ఆటోను పరిశీలించారు. అందులో అడవిపంది ఉండడంతో వారిని అదుపులోకి తీసుకొని ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఆదివారం పశు వైద్య సిబ్బంది అడవి పందికి పోస్టుమార్టం నిర్వహించి దుర్గం అటవీ ప్రాంతంలో దహనం చేశారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు వ్యక్తులు, ఆటోను సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదం లో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని 565 జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా మోపాడుకు చెందిన సీ హెచ్ సుబ్బరామయ్య పని నిమిత్తం బైక్‌పై కడప జిల్లా బద్వేల్‌కు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ తుండగా దుత్తలూరు శివారు ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అదే మార్గంలో పామూరు వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బరామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, బైక్‌ను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోయింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 425

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9275
వెండి కిలో ధర	రూ.99,700
వెండి ఒక గ్రాము	రూ.102.70

వాకర్స్‌కు షుగర్, బీపీ పరీక్షలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ స్టేడియంకు వచ్చే వాకర్స్‌తో పాటు క్రీడాకారులకు ప్రతినెలా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులతో సలహాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కోశాధికారి గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రషెట్టి, నాయకులు స్వర్ణ రమేష్, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా తిరునక్షత్ర మహోత్సవాలు



తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పేట ఉత్సవంలో భగవద్రామానుజులు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో భగవద్రామానుజచార్యులు అష్టోత్తర సహస్ర (1008) జయంతి, తిరునక్షత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవం, పేట ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా నూకల జానకమ్మ ఎండోమెంటు తరపున దగ్గుమాటి వెంకటసురేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఏ.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

● **నవాబుపేటలో..**

నవాబుపేట ఉడయవర్లు దేవస్థానంలో భగవద్రామానుజచార్యులు తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారికి తిరుమంజనం, విశేష అలంకారం, పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి ప్రాకారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు పర్యవేక్షించారు.

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయికి ఆదివారం లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు. 20మంది అర్చకులు పాల్గొని లక్ష లలితా సహస్ర నామాలను జపించారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తుమ్మగుంట కరకట్ట ఆక్రమణల పరిశీలన


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పనులు పరిశీలిస్తున్న ఏఈ రాజు, నీటిసంఘం అధ్యక్షుడు

విడవలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చౌకిచర్ల పంచాయతీ పరిధిలోని తుమ్మగుంట కాలువ కరకట్టల ఆక్రమణలను ఆదివారం కాలువ ఏఈ రాజు, చౌకిచర్ల నీటి సంఘం అధ్యక్షుడు దూది విజయరాఘవన్‌తో కలిసి పరిశీలించారు. కాలువ స్థలాన్ని ఆక్రమించుకున్న రైతులను పిలిపించి మందలించారు. రెండురోజుల్లో మరమ్మతులు చేపట్టకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

షాహుల్ హమీద్‌కు అభినందనలు..సత్కారం



బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ దిలీప్, మైమూన్ దంపతుల కుమారుడు షాహుల్ హమీద్ ఆలిండియాస్థాయి సూపర్‌స్పెషాలిటీ ప్రవేశాలకు నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో జాతీయస్థాయి 69వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని బంధువులు, ఆత్మీయులు అభినందించారు. అలాగే నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, 5వ వార్డు కౌన్సిలర్, ఎస్‌కే. షా హుల్‌ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):రామకృష్ణానగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుశీల నేత్రాలయాల గ్రూప్ ఎండీ సుధాకర్‌రావు సహకారంతో టీడీపీ నేత తాళ్ళ నరసింహ స్వామి మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మందిని పరీక్షించి 50 మందిని ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి మందులు, అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సువర్ణ, నాయకులు, శేషయ్య, వైష్ణవి, కోదండరామిరెడ్డి, హరనాథ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాల జాతర మొదలవుతోంది

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



తాటిపర్తి రహదారి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఒకే రోజు 303 అభివృద్ధికి పనులకు శంకుస్థాపన చేసి చరిత్ర సృష్టించగా ప్రస్తుతం ప్రారంభోత్సవాల జాతర మొదలవుతోందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దేవరపాళెంలో సుమారు రూ.5 కోట్లతో ఆధునీకరించిన తాటిపర్తి రహదారిని ఆదివారం ఆయన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నెల్లూరు మున్సిపల్ ప్రాంతాలు, ఇటు గ్రామాలను అభివృద్ధి చేసి ఆ ఫలాలు ప్రజలకు ఎలా అందించాలో రూరల్ ఎమ్మెల్యేని చూసి నేర్చుకోవాలన్నారు. ఇటీవల శంకుస్థాపనలు చేసిన పనులన్నింటిని మే 15న ప్రారంభించి మరో చరిత్ర సృష్టించబోతున్నాడని అన్నారు. కార్యకర్తలతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయించడం అభినందించదగ్గ విషయమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా రూరల్ నుంచి గిరిధర్‌రెడ్డి పోటీ చేయనున్నాడని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక రూరల్లో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు- తాటిపర్తి రహదారిలో పొట్టేపాళెం, ములుముడి గ్రామాల వద్ద కలుజులపై వంతెనలు నిర్మించేందుకు రూ.6 కోట్లు ఖర్చువుతుందని, అందుకు నిధులు అందచేయాలని ఎంపీని కోరారు. ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎవరున్నారు.. ఎక్కడ నుంచి వచ్చారు ?

● లాడ్జీల్లో పోలీసుల విస్తృత తనిఖీలు



లాడ్జీలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ వేణు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొత్త వ్యక్తులు ఎవరున్నారు..? ఎక్కడ నుంచి వచ్చారు..? అంటూ నెల్లూరురూరల్ పోలీసులు ఆదివారం లాడ్జీల్లో ఆకస్మికంగా విస్తృత తనిఖీలు చేశారు. నెల్లూరు-ముత్తుకూరు రహదారి వెంబడున్న లాడ్జీల్లో సీఐ గుంజి వేణు, సిబ్బంది తనిఖీలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర చరిత్ర ఉన్న వ్యక్తుల ఆచూకీ కోసం జల్లెడ పడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం శాంతిభద్రతలను కట్టడి చేసే పనిలో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. లాడ్జీల్లో ఎవరు వచ్చి రూం తీసుకున్నా వారి పూర్తి సమాచారం సేకరించాలని సూచించారు. వారిపై ఎలాంటి అనుమానం తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జేమ్స్ గార్డెన్‌లో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పోకల రవి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని 45వ డివిజన్ జేమ్స్ గార్డెన్‌లో డాక్టర్ పోకల రవి డెల్టా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులకు సంబంధించి రోగులను పల్మనాలజిస్టు డాక్టర్ పోకల రవి పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్ మాట్లాడుతూ డాక్టర్ పోకల రవి పేదలకు ఉచిత వైద్యం అందించడమే కాకుండా గత కొన్నేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తూ ప్రోత్సహించడం, చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంత్రి నారాయణ, జనసేన అధినేత పవన్‌నేత స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని డాక్టర్ పోకల రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జలిజ సంక్షేమ సంఘం నాయకుడు సుధామాధవ్, బీసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, కమతం సుబ్బారావు, పామూరు మధుసూదన్, మునిశేఖర్, ప్రశాంత్‌గౌడ్, డాక్టర్లు సునీల్, భాస్కర్, బాలకృష్ణ, లావణ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి కల్యాణోత్సవాలకు మంత్రి ఆనంకు ఆహ్వానం

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరిపై వెల సి ఉన్న వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో మే 7 నుంచి 13వ తేదీ వరకు జరిగే అనంతలక్ష్మీ సత్యదేవుల దివ్య కల్యాణ మహో త్సవాలకు రావాలని ఆలయం ఈవో సుబ్బారావు, సిబ్బంది ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలి



విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న అమిత్ కటారియా, విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య

గూడూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందినవారు నూతన ఆలోచనలతో ముందుకు వెళుతూ భవిష్యత్తులో వచ్చే సవాళ్లను ఎదుర్కొని రాణించాలని సారస్ సంస్థ సీఈవో అమిత్ కటారియా అన్నారు. ఆదివారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ విజయోత్సవ కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించి, వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పోటీ ఎక్కువగా ఉందని, వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు విలువలతో కూడిన ఉన్నత విద్యను అందించడంతోపాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో తమ కళాశాలకు చెందిన 669 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్‌పర్సన్ వంకి అనూష, డైరెక్టర్ రాజామురుగదాస్, శ్రీనివాస్, వేణుమాధవ్, రాజయ్య, ధనుంజయ, రామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతా తానై నడిపిస్తున్నాడు..

● అనధికారిక వ్యక్తి పంచాయతీ సెక్రటరీ విధుల నిర్వహణ
● పొదలకూరు బిట్-1 సచివాలయంలో ఈ తతంగం

పొదలకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ చేయాల్సిన విధులను ఓ ప్రైవేటు వ్యక్తి చేస్తుండడం, దానికి సెక్రటరీ సపోర్టు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మునికృష్ణయ్య బిట్-1 సచివాలయంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి శ్రీనయ్య విధులు నిర్వస్తున్నాడు. ఈ విషయంపై స్థానికులు ఎవరైన కార్యదర్శిని ప్రశ్నిస్తే ఆయన తన వ్యక్తిగత సిబ్బంది అని చెప్పుకొస్తున్నారు. ఇతన్ని అడ్డం పెట్టుకుని సెక్రటరీ పలు అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంతటితో ఆగకుంగా ఆయనకు జీతం మాత్రం పొదలకూరు పంచాయతీ నుంచి అందుతున్నట్లు సమాచారం. అనధికార వ్యక్తి సచివాలయ రికార్డు గదికి తాళాలు వేయడం, తాళాలు తీయడం అంతా అతనే చేస్తున్నాడు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆ అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మంత్రి ఆనంతో కమిషనర్ నందన్ భేటీ



మంత్రి ఆనంకు పూలమొక్క అందజేస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఎన్ఎంసీ కమిషనర్ వైఓ నందన్ ఆదివా రం భేటీ అయ్యారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన నగరంలోని మంత్రి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకం గా కలిసి పూలమొక్క అందచేశారు. అనంతరం కార్పొరేషన్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను చర్చించారు. నూతన నిర్ణయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలు అంశాలపై చర్చించుకున్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ శిబిరంలో 10వ తరగతి లోపు విద్యార్థులకు చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సులభ గణితం, యోగా, క్విజ్, చదరంగం, తదితర అంశాలపై ప్రజా సైన్స్ వేదిక నెల్లూరు శాఖ సహకారంతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజాసైన్స్ వేదిక నెల్లూరు అధ్యక్షుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ కొద్ది సంవత్సరాలుగా జిల్లా గ్రంథాలయంలో వేసవి సెలవులు సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సిబ్బంది కృష్ణయ్య, జితేంద్ర, గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యేని చేపల మాలతో సన్మానిస్తున్న మత్స్యకారులు

విడవలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):గంగపుత్రుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఊటుకూరు పెద్దపాళెంలో ఆదివారం మత్స్యకార సేవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్స్యకార మహిళలు, పార్టీ నాయకులు, కా ర్యకర్తలు ఎమ్మెల్యేకు చేపల మాలతో సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల హామీ మేరకు రూ.20వేలను వారి అకౌంటు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 3,102 మందికి రూ.6.20కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మత్స్యసంపదను మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా సముద్రం వరకు సీసీ రోడ్లని నిర్మిస్తామన్నారు. అనంతరం పదిలో ఉత్తమ మార్కులను పొందిన మీనంగారి తులసీరాం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఎంపీపీ ఏకుల శేషమ్మ, సర్పంచు మేకల శేషమ్మ, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, వీరేంద్రనాయుడు, సత్యవోలు సత్యంరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న మత్స్యకారులు

● ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి):ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు రూ.20వేలను వారి అకౌంట్లలో జమ చేశారని టీడీపీ మత్స్యకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు అక్కయ్యగారి ఏడుకొండలు తెలిపారు. ఈ విషయంపై ముత్తుకూరులో ఆదివారం మాట్లాడారు. చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లడం నిషేధించినట్లు చెప్పారు. వారి జీవనోపాధికిగతప్రభుత్వం రూ.10వేలు ఇవ్వగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇచ్చిందన్నారు. అలాగే మండలంలో 1,423మంది మత్స్యకారులు ఉన్నట్లు పేర్లు నమో దు కాగా అందులో 1,222 మందికి నగదు అకౌంట్లలో జమ చేశారన్నారు. గత ప్రభుత్వ ఆంక్షలతో 201 మంది మత్స్యకార భరోసా ఇవ్వలేదన్నారు.

● **మత్స్యకారులకు రుణపడి ఉంటా**

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు (ఆంధ్రజ్యోతి):మత్స్యకారుల రుణం తీర్చుకోలేదని వారికి తాను రుణపడి ఉంటానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోడూరు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర పట్టపుపాలెంలో నిర్వహించిన మత్స్యకారులకు భరోసా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మట్లాడారు. పార్టీకి మత్స్యకార గ్రామాల్లో అత్యధిక మెజార్టీ వచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. నియోజకవర్గంలో 1887మందికి రూ.3.77కోట్లు మత్స్యకారుల అకౌంట్లలో రూ.10వేలు చొప్పున నగదు జమైనట్లు చెప్పారు. మే నెలలో చదువుకున్న ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతేకాక బీసీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు రుణాలు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, రైతు విభాగం నాయకులు రాధాకృష్ణ నాయుడు, సాగునీటి సంఘం అధ్యక్షులు బాబు నాయుడు, గోపాల్ నాయుడు, సీతారామయ్య, వీరబోయిన గంగాధర్, మునిరత్నం, పరశురాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ.. విద్యార్థుల నిష్పత్తి 1:20 కొనసాగించాలి

కోవూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తిని 1:20కొనసాగించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చు డేవిడ్ చిన్నబాబు డిమాండు చేశారు. ఈ విషయంపై స్థానిక లక్ష్మీనగర్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం 1:30 నిష్పత్తిలో కొనసాగుతున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు త్వరలో మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడితే విద్యావ్యవస్థ కుం టుపడుతుందని చెప్పారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరక్టర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఏకోపాధ్యాయ పోస్టులకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల్ని ప్రమోషన్‌పై నియమిం చాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల్ని పరిష్కరించాల్సిందిగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

మనుబోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి ప్రభుత్వ ఆదేశాలతో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ బాండాగారు అరుణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8నుంచి 11గంటల వరకు కథలు వినడం, పుస్తకాలు చదవ డం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిషు, ఇతర నైపుణ్యాలు చేయిస్తామన్నారు. విద్యార్థులు గ్రంథాలయంకొచ్చి శిబిరంలో పాల్గొనాలని అరుణ్‌కుమార్ కోరారు. జూన్ 6 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

చిన్నారులకు ఉచిత ఖత్నా కార్యక్రమం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీ మంజిల్‌లో ఆదివారం ఉలమా కమిటీసభ్యుల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు చిన్నారులకు ఉచితంగా ఒడుగులు (ఖత్నా) చేయించారు. అనంతరం వారికి మందులు అందజేశారు. కార్యక మంలో మౌలానా అబ్దుల్ హమీద్, వైద్యులు యూసుఫ్, సమద్ నజీర్, కమిటీ సభ్యులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు నెలపొంగళ్లు



అలంకరణలో గంగమ్మ తల్లి

మనుబోలు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన గంగమ్మపరమేశ్వరికి ఆదివారం భక్తులు నెలపొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఉగాది గ్రామోత్సవం పూర్తయి నెలరోజులు ముగియడంతో మనుబోలు యాదవసంఘం సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజ కార్యక్రమాలకు ఉభయదాతలుగా దుగ్గన పద్మనాభయ్య, అరుణమ్మ దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా కొత్త గంగపెట్టెను దుగ్గన రమేష్, సురేష్ యాదవ్ ఆలయానికి అందజేశారు. గంగపెట్టెకు ప్రత్యేకపూజలు చేసి వీరతాళ్ళు వేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు, భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

వెంకటాచలం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. వివరాల్లోకి వెళితే, గూడూరు నుంచి నెల్లూరు వైపుగా లారీ వెళ్తుండగా పందులు అడ్డురావడంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో అదేమార్గంలో వెనుక వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ముందున్న లారీని ఢీకొంది. అయితే బస్సులోపల ఉన్న ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంతో రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహగాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వ మత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంపల మంజుల గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు, అలాగే ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పోలీస్ క్వార్టర్స్


ఇందుకూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దశాబ్దాల కిందట నిర్మించిన పోలీస్ క్వార్టర్స్‌లో నేడు వసతులు లేక నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉండేవారు. కాలక్రమంలో ఏమైందో తెలియదు కానీ క్వార్టర్స్‌లో ఉండే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. నేడు ఇందులో ఎవరూ లేక నిరుపయోగంగా మారింది. ఈ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసులు క్వార్టర్స్‌లో ఉంటే ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే వీలుంటుంది. ప్రస్తుతం క్వార్టర్స్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది బయట అద్దె భవనాల్లో నివాసం ఉంటున్నారు. మరికొందరు నెల్లూరు, ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఇక్కడికి వి ధుల నిర్వహణకు వచ్చి వెళుతున్నారు. చాలామంది పిల్లల చదువుకోసం అని కూత వేటు దూరంలో ఉన్న నెల్లూరు లోనే నివాసం ఉంటున్నారు. అలాగే వాతావరణం ప్రశాంతంగా ఉంటుందని ఆ లోచనతో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు ఈ ప్రాంతంలో నివాసం ఉంటూ విధులకు హాజరవు తుంటారు. ఉద్యోగులు నివాసం ఉండే వారి సంఖ్య ఇందుకూరు పేటలో పెరగడంతో దీంతో ఇంటి అద్దెలు ఎక్కువగానే ఉన్నాయి. ఎంతో విలువైన పోలీస్ క్వార్టర్స్ ఇందుకూరుపేట నడిబొ డ్డులో ఉంది. ఈ కొత్త క్వార్టర్స్ భవనాల మర మ్మతులు లేదా నూతన భవనాలను నిర్మిస్తే సిబ్బందికి బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా జూదరులకు పేకాట స్థావరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఎంతో విలువైన ఈ స్థలంను కబ్జాకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై స్థానిక శాసన సభ్యురాలు ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.




ఇందుకూరుపేటలోని పోలీసు క్వార్టర్స్

మంత్రి ఆనంతో ఎంపీ భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట),ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి భేటీ అయ్యారు. ఆత్మకూరులో మే 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు, జిల్లా అభివృద్ధికి సంబంధించి సీఎం దృష్టికి తీసుకెళ్లాల్సిన ముఖ్యమైన అంశాలు, ఇతర పనులు, కార్యక్రమాలపై చర్చించుకున్నారు.







నగర సేద్యం

మడక దున్నుతున్నారు.. మాను తోలుతున్నారు.. అడుసు తొక్కుతున్నారు.. నారు పెరుకుతున్నారు.. నాట్లు వేస్తున్నారు.. ఎండకి చెట్టునీడకి చేరి సేదదీరుతున్నారు.. నడివేసవిలో సాగుతున్న ఈ వరిసేద్యం దృశ్యాలు నీటి వనరులకు లోటులేని ఏ మారుమూల పల్లెల్లోనివో కాదు. లక్షల జనంతో కిక్కిరిసిన తిరుపతి నగరంలోనివి. కాంక్రీట్‌జనారణ్యంలో ఆదివారం మిట్టమధ్యాహ్నపు వేళ 'ఆంధ్రజ్యోతి' కంటబడ్డ శ్రమసౌందర్యం ఇది. అభయమిస్తున్నట్టుగా తిరుమల కొండ.. కొండతో పోటీ పడుతున్నట్టుగా ఆకాశహర్మ్యాలు.. సందడితో నిండిన రెస్టారెంట్లు, రహదారిపై దూసుకుపోయే వాహనాల రణగొణ శబ్దాలు.. వాటి నడుమనే తిమ్మినాయుడుపాళెం మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు ఆనుకుని ఇలా వ్యవసాయం సాగుతోంది. విస్తరించుకుని వస్తున్న రియల్‌ఎస్టేట్ వెంచర్ల మధ్యనే ముత్తు, చిరంజీవి, రమణ, మునికృష్ణ అనే నలుగురు రైతులు ఖాళీగా ఉన్న భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. ఎకరా కోట్లు పలికే నేలలో వేల రూపాయలైనా గిట్టుబాటు కాని కష్టం ఎందుకు అని ఈ రైతులు అనుకోలేదు. రోజూ 'మడికాడికి నడిచి, పచ్చని గాలి పీలిస్తే ఉండే ఆనందం వేరే' అంటున్నారు ఈ కర్షకులు. 'రెండు కార్లు పండుతున్నాయి. ఇంటికి కావలసిన గింజలు వస్తున్నాయి. ఇంతకన్నా కావాల్సింది ఏమి?' అని సంతృప్తిని ప్రకటిస్తున్నారు వీరు. పచ్చని పైరు తన హృదయంపై పరచుకుంటేనే నేలతల్లికి శాంతి. కాయకష్టంతో చెమట కారితేనే రైతుకీ మనశ్శాంతి.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

చెట్టు తొర్రలో సారా



- చెంబుల్లో దాచిన అక్రమార్కులు
- పసిగట్టిన డ్రోన్



ఎర్రావారిపాలెంలో చెట్టు తొర్రలో దాచి ఉంచిన సారాను బయటకు తీస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డ్రోన్ల నిఘా పెరిగింది. తాజాగా చెట్టు తొర్రలో దాచి ఉంచిన సారా గుట్టును డ్రోన్ రట్టు చేసింది. ఎర్రావారిపాలెం, భాకరాపేట, తలకోన, వేములవాడ, గ్రామాల పరిధిలో ఇటీవల నాటుసారా తయారీ ఎక్కువగా ఉంది. నాటుసారాను తయారుచేసి వివిధ ప్రాంతాల్లో దాచి.. రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు ఎన్నిసార్లు తనిఖీలు చేపట్టినా ఇలా దాచి ఉంచిన సారాను పట్టుకోలేని పరిస్థితి. చెట్లు చాటున సారా తయారు చేసి.. చెట్టు తొర్రల్లో దాచిన ముఠాను గుర్తించడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. భాకరాపేట సీఐ ఇమ్రాన్‌భాషా ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, పోలీసులు డ్రోన్ నిఘా పెట్టారు. ఎర్రావారిపాల్లెం మండలం వేములవాడ గ్రామం, తలకోన వాటర్ కెనాల్, భాకరాపేట,తో పాటు దాదాపు 25 ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేసి అనుమానం వున్న ప్రతి ప్రాంతాన్ని నిశితంగా తనిఖీ చేశారు. దీనికోసం ప్రత్యేక బృందం సీఐ వినోద్‌కుమార్ డ్రోన్ అందించిన ఫొటోల ఆధారంగా సారా తయారు చేసి దాచి వుంచిన స్థలాలను కనుగొన్నారు. అక్కడకు చేరుకుని చెట్ల తొర్రల్లో దాచి వుంచిన 14 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రోన్ సాయంతో వేములవాడ గ్రామానికి చెందిన హనుమంతు, వేణు, మునస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇక, సత్యవేడు, విజయపురం

డ్రోన్ల సహాయంతో నాటుసారా స్థావరాలపై నిఘా ఉంచిన పోలీసు అధికారులు రెండో విడతలో సత్యవేడు, విజయపురం మండలాల్లో నిఘా ఉంచనున్నారు. రెండు డ్రోన్లు ఉపయోగించి జిల్లా వ్యాప్తంగా నాటుసారా, గంజాయి, మత్తు పదార్థాలు గుర్తించేలా ఎస్పీ హర్షవర్ధనరాజు ప్రత్యేక పోలీసు బృందాలకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా తిరుపతి, చంద్రగిరి ప్రాంతాలపై ఎక్కువగా ఫోకస్ చేయనున్నారు.

నిమిషం లేటైనా అనుమతించరు



ద్వారకనాథరెడ్డి

- ఎల్లుండే పాలిసెట్
- తిరుపతి, గూడూరు, సత్యవేడుల్లో 15 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి స్పష్టంచేశారు. పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశానికి ఈనెల 30న (బుధవారం) నిర్వహించే పాలిసెట్‌కు సకాలంలో ఆయా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆయన తెలిపిన ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా 5,288 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో తిరుపతిలో 3,771 మందికి 8 కేంద్రాలు, గూడూరులో 1,217 మందికి 5, సత్యవేడులో 300 మందికి రెండు చొప్పున మొత్తం 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 30వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్ష కోసం అభ్యర్థులను ఉదయం 10 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. హాల్‌టికెట్, ఏదేని గుర్తింపు కార్డుతోపాటు హెచ్‌బీ పెన్సిల్, బాల్‌పాయింట్ పెన్, ఎరేజర్, షార్ప్‌నర్ తెచ్చుకోవాలి. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదు. ఉదయం 9.30 గంటలకే అభ్యర్థులు ఆయా కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి టెన్షన్ లేకుండా పరీక్ష రాయొచ్చని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు.

ఇవీ పరీక్షా కేంద్రాలు

తిరుపతి: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్.. ఎస్వీ డబ్ల్యూ టీటీడీ పాలిటెక్నిక్ (ఎస్వీ డెయిరీ ఫారం సమీపాన).. ఎస్వీ జూనియర్ కళాశాల, వింగ్-ఎ, వింగ్ బి (విద్యాపీఠం సమీపం).. ఎస్వీ బాలికల పాఠశాల (బాలాజీకాలనీ).. ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల, వింగ్-ఎ, వింగ్-బి (పద్మావతి గెస్ట్ హౌస్ వద్ద).. ఎస్‌జీఎస్ హైస్కూల్ (టీటీడీ ఏడీ భవనం సమీపం). **గూడూరు:** డీఆర్‌డబ్ల్యూ కళాశాల.. ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. ప్రభుత్వ పాలిటెక్నిక్ (తిలక్ నగర్).. బాలికల జడ్పీ హైస్కూల్.. బాలుర జడ్పీ హైస్కూల్.
సత్యవేడు: పీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల.. ప్రభుత్వ పాలిటెక్నిక్.

కన్నతల్లికి చిత్రహింసలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని తనయుడు చిత్రహింసలు పెట్టిన ఘటన సూళ్లూరుపేట పట్టణంలో వెలుగు చూసింది. సూళ్లూరుకు చెందిన కొప్పోలు రామారావు తన తల్లిని కొట్టి, గోడకేసి మొత్తి చిత్రసింహలు పెట్టాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే రామారావును పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు. కన్నతల్లిని కొడుతూ చిత్రహింసలు పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

విహారంలో విషాదం

- భూపతీశ్వరకోనలో చెన్నై యువకుడి మృతి



సచిన్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రకు వచ్చిన యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన నాగలాపురం మండలం భూపతీశ్వరకోనలో ఆదివారం జరిగింది. నాగలాపురం ఎస్‌ఐ సునీల్ తెలిపిన ప్రకారం.. టీపీకోట సమీపంలోని భూపతీశ్వర కోన జలపాతానికి చెన్నైకు చెందిన నలుగురు యువకులు వచ్చారు. కోనలో సరదాగా కాసేపు గడిపి, స్నానం కోసం మడుగులో దిగారు. వీరిలో సచిన్ (22) నీట మునిగి ఎంత సేపైనా బయటకు రాలేదు. మిగిలిన ముగ్గురు స్నేహితుల్లో ఒకరైన హేమంత్ 100కు డయల్ చేసి సమాచారమిచ్చాడు. ఆ వెంటనే నాగలాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాలించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సచిన్ తమిళనాడు రాష్ట్రం తిరుప్పూర్‌కు చెందిన మూర్తి కుమారుడు. చెన్నై గిండిలోని రాంకో సిస్టమ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఇతడు స్నేహితులతో కలిసి ఉంటున్నట్లు తెలిసింది.

టెన్త్ విద్యార్థులకు నేటినుంచి రెమిడియల్ క్లాసులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి ఫెయిలైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం నుంచి రెమిడియల్ క్లాసులు నిర్వహించనున్నారు.విద్యార్థులు ఎక్కువగా గణితం, జనరల్ సైన్స్‌లో ఫెయిలైనట్టు విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఆయా విద్యార్థులు రానున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టారు. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. మండలానికి రెండు,మూడు పాఠశాలల చొప్పున మొత్తం85 పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు నిర్వహించనున్నారు. ప్రతీరోజూ ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.ఫెయిలైన విద్యార్థులు క్రమం తప్పకుండా రెమిడియల్ క్లాసులకు హాజరయ్యేలా పెద్దలు కూడా బాధ్యత వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న నాని

తిరుమలలో హిట్-3 బృందం

- నడిచి కొండకు చేరుకున్న నాని, శ్రీనిధిశెట్టి

తిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో హీరో నాని ఆదివారం సందడి చేశారు. హీరోయిన్ శ్రీనిధి శెట్టి , హిట్-3 సినిమా బృందంతో కలిసి తెల్లవారుజామున సుప్రభాత సేవలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతిఏడాది శ్రీవారి దర్శనానికి వస్తుంటానని, అలాగే ప్రతి సినిమా ముందుకు తిరుమలకు రావడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు. ఒకవేళ రాకపోతే ఏదో అసంపూర్ణంగా ఉంటుందన్నారు. ఆలయం ముందు హీరో, హీరోయిన్‌లతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. అలాగే గ్యాలరీల్లో ఉన్న కొంతమంది భక్తుల వద్దకు హీరో నాని వెళ్లి పలకరించారు. వారితో సెల్ఫీలు దిగి ఉల్లాసంగా గడిపారు. శనివారం రాత్రి నాని, శ్రీనిధిశెట్టి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. భక్తులు గుర్తించకుండా ఉండేందుకు నాని నడకదారిలో ముఖానికి మాస్క్‌లా గుడ్డ కట్టుకున్నారు.



- వివిధ సేవా టిక్కెట్లు, ప్రసాదాలు కలిపి రూ.కోటి ఆదాయం
- వాయులింగేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ముక్కంటి ఆలయంలో 8,766 రాహుకేతు పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు పూజల సంఖ్య ఆదివారం సరికొత్త రికార్డుగా నమోదైంది. ఒక్క రోజే ఐదు విభాగాలు కలిపి మొత్తం 8,766 రాహుకేతు సర్పదోష నివారణ పూజలు నమోదయ్యాయి. ఇందులో రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 4,739మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 2,481, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 862మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 492మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 192మంది పూజలు చేయించుకున్నారు. వివిధ సేవలు, ప్రసాదాల ద్వారా ఆలయానికి రికార్డుస్థాయిలో ఆదాయం నమోదైంది. వివిధ సేవల ద్వారా రూ.1,02,62,356 ఆదాయం వచ్చింది. అందులో ఆశీర్వాదం 1, స్వామి అమ్మవార్ల అభిషేకం 139, శనీశ్వర స్వామి అభిషేకం 42, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం 38, గోపూజ 46, మృత్యుంజయస్వామి అభిషేకం 4, రుద్ర హోమం 6, సుప్రభాత సేవ 16, చండీ హోమం 13, నిత్య కల్యాణం 5, అర్చన 116గా నమోదైంది. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 28,470 అమ్ముడైనట్లు ఆలయాధికారులు తెలిపారు

ఆలయంలో భక్తుల రద్దీ

ఆదివారం అమావాస్య కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. శనివారం రాత్రే పట్టణంలోని లాడ్జీలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆదివారం వేకువజాము నుంచే స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 35 వేలమంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. రూ.500 అంతరాలయ దర్శనం 563 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 5,769 మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 4,109 మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



తిరుమల కిటకిట

సొంత, అద్దె వాహనాల్లో, శ్రీవారి మెట్టు.. అలిపిరి కాలిబాటల్లో, ఆర్టీసీ బస్సుల్లో తిరుమల కొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వారాంతం, వేసవి సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే రద్దీ పెరిగింది. ఆదివారమూ కొనసాగింది. తిరుమలలో ఎటు చూసినా భక్తులే గుంపులు గుంపులుగా కనిపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరి కాయలు కొట్టి కాలినడకన తిరుమల వెళుతున్న భక్తులు

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రవిప్రభు

- రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధ



డాక్టర్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : రుయాస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జి.రవిప్రభు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. రుయాలో అనస్థీషియా విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ జె.రాధను రుయా సూపరింటెండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు.

భక్తులతో కిటకిటలాడిన చెంగాళమ్మ ఆలయం



ఆలయ ప్రాంగణంలో భక్తులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య రోజు రాత్రి ఆలయంలో నిద్రిస్తే కోర్కెలు నెరవేరి మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ఆలయ ఆవరణలో నిద్రించారు. అదే విధంగా వేనాడు దర్గాకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

2నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం



క్రికెట్ సబ్‌సెంటర్ ప్రతినిధులు, క్రీడాకారులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వం స్టేడియంలోని క్రికెట్ సబ్‌సెంటర్‌లో మే 2వ తేదీ నుంచి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు సబ్‌సెంటర్ ఇన్‌చార్జి మునిగిరీస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏటా ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించి యువ క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. క్రికెట్‌లో కోచ్ ద్వారా నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నెలరోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో 7నుంచి 16 సంవత్సరాల లోపు వాళ్లు పాల్గొనవచ్చునన్నారు. కార్యక్రమంలో మస్తాన్, అనిల్‌కుమార్, సురేంద్రరెడ్డి, లవకుమార్, నాగేశ్వరరావు, రజిని, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, నూర్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ద్రౌపదీ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

తడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పం గ్రామంలో జరుగుతున్న పంచపాండవ ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా ద్రౌపది, అర్జునుల కల్యాణం జరిపించారు. అనంతరం మిగిలిన పాండవులతో కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోపేతంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి ద్రౌపది సమేత పంచపాండవుల గ్రామోత్సవం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నై శక్తి ఈవెంట్, ఎంఎస్ ఈవెంట్ ఆధ్వర్యంలో పాట కచ్చేరి, హాస్యవల్లరిని నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మన ఫణి, శ్రీధర్, జయరామయ్య, ధనుంజయ తదితరులు పర్యవేక్షించారు.


విద్యార్థినికి అభినందన



ఇంద్రజను సత్కరిస్తున్న డాక్టర్ శేఖర్, హెచ్ఎం సంపూర్ణమ్మ, భాస్కర్

డక్కిలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి చెందిన కలపాటి మోహన్, వరమ్మ దంపతుల కుమార్తె ఇంద్రజకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీ జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ బీబీజీటీఎస్ మూర్తి తన చిన్నాన్న బత్తల భాస్కర్ ద్వారా ఇంద్రజకు రూ.5000 నగదు అందజేశారు. ఫోన్‌లో ఇంద్రజను అభినందించారు. అలాగే ప్రభుత్వ వైద్యుడు కలపాటి శేఖర్, చెన్నసముద్రం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సంపూర్ణమ్మ విద్యార్థిని ఇంద్రజను శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కలపాటి సుందరయ్య, నథనియల్, సుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోట - తిరుపతి ఆర్టీసీ సర్వీస్ ప్రారంభం



ఆర్టీసీ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఎం నరసింహులు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు

చిట్టమూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కోట నుంచి వాకాడు, చిట్టమూరు మీదుగా తిరుపతికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను ఆదివారం చిట్టమూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద తిరుపతి ఆర్ఎం నరసింహులు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ప్రారంభించారు. ఈ సర్వీస్ కోటలో ప్రతిరోజూ ఉదయం 6, మధ్యాహ్నం 12గంటలకు, అలాగే తిరుపతిలో ఉదయం 9, సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతుంది. కార్యక్రమంలో వాకాడు డిపో మేనేజర్ పెంచలయ్య, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చిన్న బలరామయ్య, మెకానికల్ ఇంజనీర్ నారాయణ, సూపర్‌వైజర్ రఘురామయ్య, టీడీపీ నాయకులు బాబు నాయుడు, జనార్దనరెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్నారావు, కండక్టర్ నరసింహులు, డ్రైవర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తుమ్మూరులోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ శివశంకర్ తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని సీఎస్‌తేజ సెంటర్, మంగపత్తి నాయుడు నగర్, కుమ్మరవీధి, బేరిపేట, ఆర్ముగంనగర్, రజకకాలనీ, మార్కెట్ వీధి, శివాలయం వీధి, చిన్నదర్గారోడ్డు, బ్రాహ్మణవీధి, గిండివారితోట, బజారువీధి, గరిడివీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు శిక్షణ

నాయుడుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఫెయిలై, సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు సోమవారం నుంచి నాయుడుపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వబడుతుందని, మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు.

దేనికీ వినియోగించుకోలేరా?

పదేళ్లుగా ఖాళీగా ఉన్న బాలికల వసతిగృహం



విన్నమాలలోని బాలికల వసతి గృహ భవనం

నాయుడుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ సమీపంలోని విన్నమాల గ్రామంలో నిర్మించిన బాలికల వసతి గృహం పదేళ్లుగా ఖాళీగా ఉంది. పట్టణంలోని ఎల్ఏ సాగరంలో డిగ్రీ కళాశాల, తుమ్మూరులో జూనియర్ కళాశాల ఉన్నాయి. వీటిల్లో చదువుకునే బాలికల కోసం పట్టణ సమీపంలోని విన్నమాల గ్రామంలో రూ.2.5 కోట్లతో వసతి గృహాన్ని నిర్మించి 2015 ఆగస్టు 5న ప్రారంభించారు. డిగ్రీ కళాశాలకు ఐదు కిలోమీటర్లు, జూనియర్ కళాశాలకు మూడు కిలోమీటర్ల దూరంలో వసతి గృహం ఉండడంతో అందులో చేరేందుకు బాలికలు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా జానకి చొరవ తీసుకుని కళాశాల విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్ మెయిన్స్ కోసం ఈ భవనంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. శిక్షణ పొందే విద్యార్థులకు అక్కడే వసతితో పాటు భోజన సదుపాయం కల్పించారు. తరువాత ఆమె బదిలీపై వెళ్లిపోవడంతో ఈ భవనంలో ఎటువంటి కార్యకలాపాలు లేక నిరుపయోగంగా ఉంది. ఇదిలా ఉండగా, పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకుగా వున్న అద్దె భవనంలో నిర్వహిస్తుండటంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు నిల్చునేందుకు కూడా స్థలం సరిపోవడంలేదు. అలాగే నాయుడుపేట పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన పాత భవనంలోనే నేడు మున్సిపాలిటీ కార్యాలయం ఉంది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించడానికి ఆ భవనం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఆర్అండ్‌బీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ కార్యాలయాలను వసతిగృహంలోకి తరలించినా ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. అయితే ఎందుకనో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఫలితంగా రూ.2.5 కోట్లతో నిర్మించిన భవనం పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది.

కోనోకార్పస్ మొక్కలను రక్షించండి

పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపురెడ్డి



తిరుపతి(లీలామహల్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కోనోకార్పస్ మొక్కపై నిరాధార నిందలు ఆపి ఎన్నో ప్రయోజనాల గల కోనోకార్పస్ మొక్కను రక్షించాలని పర్యావరణవేత్త, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి కోరారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రముఖ ఆడిటర్ పల్లుణ కుమార్, ఎస్వీ యూనివర్సిటీ జియాలజీ ప్రొఫెసర్ టి.వి.కృష్ణారెడ్డి, ఆల్ ఇండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కెఎంఎల్.నరసింహులు హాజరయ్యారు. బయ్యపురెడ్డి మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్క మొదట యమన్ దేశంలో సహజసిద్ధంగా పెరిగి క్రమేణా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. దుబాయ్, కువైట్, అబూదబి వంటి గల్ఫ్ దేశాల్లో నీరు లభించకపోయినా 70 శాతానికి పైగా పచ్చదనాన్ని అందిస్తున్నాయన్నారు. ఈ మొక్కలు కార్బన్ డైఆక్సైడ్‌ను అత్యధికంగా తీసుకుని అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తాయని తెలిపారు. ఇవి అన్ని రకాల నేలల్లో పెరుగుతాయని, కలుషిత నీటిని, భూమిని కాపాడడమేకాక, వాయు, ధ్వని కాలుష్యం నుంచి ప్రజలను రక్షిస్తాయని వివరించారు. నిర్వహణ వ్యయం అవసరం లేదన్నారు. విదేశీ మొక్క అనే విమర్శను ఖండిస్తున్నానని, టమోటా, ఆలుగడ్డలు, మిర్చి, కాఫీ, టీ, మిర్చి లాంటివి కూడా విదేశీ మొక్కలేనని గుర్తుచేశారు. అలర్జీ, ఆస్తమా లాంటి సమస్యలు వ్యక్తిగతమైనవని తెలుపుతూ బెంగళూరులోని అంతర్జాతీయ విద్యా సంస్థల్లో వేలాది కోనోకార్పస్ మొక్కలతో నిండి ఉన్నాయని, ఏ ఒక్క విద్యార్థికీ ఆస్తమా, అలర్జీ సమస్య రాలేదన్నారు. ప్రపంచంలో సగటున ఒక్కొక్క మనిషికి 422 చెట్లు ఉండగా బ్రెజిల్‌లో 1,500, అమెరికాలో 720, కెనడాలో 318, చైనాలో 140 చెట్లు ఉండగా భారత్‌తో మాత్రం కేవలం 28 మాత్రమే ఉన్నాయని వివరించారు. బహుళ ప్రయోజనాలు అందించే కోనోకార్పస్ మొక్కలను రక్షించడానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వృక్ష ప్రేమికులు కృషి చేయాలని కోరారు. కోనోకార్పస్ మొక్కలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఆకట్టుకుంది.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కవచ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

వెంకటగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో హిందూ పర్యాటకులపై మారణకాండకు పాల్పడిన ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ పట్టణంలోని కాశీపేట కూడలిలో ఆదివారం కవచ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు కాశీపేట కూడలిలో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విష్ణుమోహన్, రవి, మణి, వెంకీ, బాషా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

చిల్లకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనగారి పాళెం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి కుడుమల గోపాల్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ తిమ్మనగారిపాళెం చేరుకుని గోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలను అధికారులు తొలగించడం సరికాదని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రంలో వేరుశనగ పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌కు తీసుకున్న భూముల్లో సాగు చేసిన వేరుశనగ పంటను అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాదర్తి రాధకృష్ణారెడ్డి, ఉప్పల ప్రసాద్‌గౌడ్, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, వెంకటాద్రి, సర్పంచు తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి తిప్పపై వెలసిన పర్వత వర్ధిని సమేత భీమేశ్వరాలయంలో ఆదివారం పహల్గాం మృతులకు గ్రామస్తులు నివాళులర్పించారు. గూడలితిప్పపై శాంతి దీపాన్ని వెలిగించి ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వాకాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతి రూ.20వేలకు పెంచి ఇవ్వడం పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వైట్‌కుప్పం గ్రామంలో మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి గోవిందయ్య ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బాబు, వెంకటేశ్వర్లు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

వేసవి శిక్షణ తరగతులు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి అంజయ్య తెలిపారు. కథలు, స్పోకెన్ ఇంగ్లీష్, కెరీర్ గైడెన్స్, జనరల్ నాలెడ్జి, యోగా, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

ఇంట్లో చోరీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండోపట్టణ పరిధిలోని చింపిరినాయుడుకట్ట ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ జరగడంతో ఆదివారం బాధితురాలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక చింపిరి నాయుడుకట్ట ప్రాంతానికి చెందిన నాగమణి శనివారం రాత్రి తన ఇంటికి తాళం వేసుకుని సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాను పగలగొట్టి, అందులో ఉన్న 3 సవర్ల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

దుకాణంలో చోరీ

వాకాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వాకాడు అశోక్ పిల్లర్ ప్రాంతంలోని ఓ చిల్లర దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితురాలు చింతల రమణమ్మ తెలిపిన వివరాల మేరకు... శనివారం 9 గంటలకు దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లగా షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దుకాణంలో ఉంచిన రూ.10వేలు కనిపించకపోవడంతో బాధితురాలు ఎస్ఐ నాగబాబుకు ఫిర్యాదు చేశారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పరిధిలో దొంగతనాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కావడంతో మిద్దెపై నిద్రించేవారు ఇంటి తాళాలను సక్రమంగా వేసుకోవడంతో పాటు జాగ్రత్తలు పాటించాలన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంటిలోని బంగారు ఆభరణాలను, నగదును సురక్షితంగా భద్రపరుచుకుని ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



వెంకటేశ్వర్లుకు నగదును అందజేస్తున్న జలీల్ అహ్మద్

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోట దళితవాడకు చెందిన యర్రమతి వెంకటేశ్వర్లు కుమార్తె అరుణ జ్యోతి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ రూ.10వేలు అందజేశారు. అలాగే ఎంపీటీసీ దారా సురేష్ రూ.5 వేలు అందజేశారు.

కోటమ్మకు పూజలు

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వాహనాల తనిఖీ

ఓజిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం ఎస్ఐ స్వప్న వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. అదే విధంగా వాహనాలకు సంబంధించి అన్ని ధృవ పత్రాలను కలిగి ఉండాలన్నారు.

రోడ్డుపై కొండచిలువ

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డుపై కొండచిలువ కనిపించడంతో కలకలం రేగింది. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండు నుంచి చెరువు వైపు వెళ్లే మార్గంలో కొండచిలువ రోడ్డు దాటుతూ కనిపించింది. దీంతో అటుగా వెళ్లే స్థానికులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

నూతన ఆలోచనలతో ముందుకెళ్లాలి



విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న అమిత్ కటారియా, విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందినవారు నూతన ఆలోచనలతో ముందుకు వెళుతూ భవిష్యత్తులో వచ్చే సవాళ్లను ఎదుర్కొని రాణించాలని సారస్ సంస్థ సీఈవో అమిత్ కటారియా అన్నారు. ఆదివారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ విజయోత్సవ కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించి వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పోటీ ఎక్కువగా ఉందని, వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు విలువలతో కూడిన ఉన్నత విద్యను అందించడంతో పాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో తమ కళాశాలకు చెందిన 669 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్‌పర్సన్ వంకి అనూషా, డైరెక్టర్ రాజామురుగదాస్, శ్రీనివాస్, వేణుమాధవ్, రాజయ్య, ధనుంజయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. ఆదివారం స్థానిక తిలక్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు. వాహనదారులు సరైన ధృవీ కరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మనోజ్‌కుమార్, సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లంపాడు - నెల్లూరు సర్వీస్ ప్రారంభం



అల్లంపాడు బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డీఎం చినపెంచలయ్య

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు నుంచి నెల్లూరుకు నూతన బస్ సర్వీస్‌ను వాకాడు డీపో మేనేజరు చినపెంచలయ్య ఆదివారం ప్రారంభించారు. గతంలో ఆదాయం లేని కారణంగా ఈ బస్ సర్వీస్‌ను డిపో అధికారులు రద్దు చేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు డీఎం స్పందించి కొత్త బస్సు సర్వీసును ప్రారంభించారు. కోట నుంచి అల్లంపాడు మీదుగా నెల్లూరుకు బస్ సర్వీసు నడుస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో అధికారులు రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి

పెళ్లకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపూడి పంచాయతీ యాలకారికండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు వేణుంబాక మునిరామయ్య సోదరుడు హరికృష్ణ, లక్ష్మి వివాహం ఇటీవల జరిగింది. ఆదివారం యాలకారికండ్రిగలో జరిగిన రిసెప్షన్‌కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆమె భర్త పార్థసారధి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

విద్యార్థినులకు అభినందన

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచాటిన ప్రభుత్వ పాఠశాలల బలిజ విద్యార్థినులను బలిజ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు అభినందించారు. పలువురు విద్యార్థినులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి, సారంగం శ్రీనివాసులు, పద్మావతి, సువర్ణలక్ష్మి, అరుణ, ఉషా తదితరులు పాల్గొన్నారు.